(34-వ పేజీ తరువాయి)

"అమ్మాయీ! అమ్మాయీ!"

అని పిల్చింది. ఇంటిలో ఆమె స్వరం మాత్రము ప్రతిధ్వనించిందికాని బిడ్డ కన్పించలేదు. భూదేవి తక్కిన దేవతా బాలల ఇండ్లకు వెళ్ళింది.

"మా అమ్మాయి కన్పించిందా?"

"ఉదయం మాతోనే ఆడుకోడానికి వచ్చింది"

"తిరిగి వచ్చేటప్పుడు కన్పించినట్లు లేదు"

భూదేవి ఎంతో విచారించింది, శ్రద్ధగా ప్రతిచోటు వెదికింది. కొండలూ, లోయలూ, గుంటలూ, మెట్టలూ, ప్రతిపాద వెదికింది. ఎక్కడా తన ముద్దులబిడ్డ కన్పించలేదు. పుత్రికా వియోగంవల్ల ఆమెకు పిచ్చి ఎత్తినట్లు అయింది. ఆ రాత్రి అంతా ఆమెను వెదకుతూనే ఉంది.

మరుసటిదినము ఉదయము భూదేవికి తన పని మీద వెళ్ళాలి అనే ధ్యాసే కలగలేదు. బిడ్డను వెదకుకొంటూ తిరుగుతూంది. బిడ్డ కన్పించలేదు. భూదేవి బిడ్డకై విచారిస్తూ తన గృహంలోనే ఉండిపోయింది.

భూదేవి లేకపోతే భూమిలో పంటలు పండించేదెవరు? పువ్వులు పూయించేదెవరు? కాయలు కాయించేదెవరు? భూలోకమంతట భయంకరమైన క్షామము కలిగింది. చెట్లు చేమలు ఎండిపోయాయి. పొలాలు నిలువునా ఎండిపోయాయి. పిందెలతో చెట్లు మలమల మాడిపోయాయి. ఎక్కడా ఒక్క పచ్చని ఆకు కన్పించలేదు. ఒక పుష్పము పూయలేదు. ప్రపంచములోని జీవరాసులన్నీ ఆకలికి మలమల మాడిపోయారు. అలమటించారు. వారి ఆక్రందనాలతో దిక్కులు మారుమ్రోగాయి.

దేవలోకాధిపతియైన "జ్యూపిటర్"కు ఈ ఆక్రందనాలు విన్పించాయి. ఒక్కనిమిషంలో భూలోకంలోని కఱవునకు కారణము తన దివ్యదృష్టివలన తెలిసికొన్నాడు. భూదేవి తనపుత్రిక లేకుండ పొలాలు పండించదు. ఆమెను అడిగి లాభం లేదు: జ్యూపిటర్ తన దివ్యదృష్టితో దేవలోకాలన్నీ వెదికాడు. ప్రొసర్పినా కన్పించలేదు. భూలోకంలోని మారుమూలలన్నీ వెదికాడు. ఊహుఁ... భూదేవిపుత్రిక కన్పించలేదు. చివరకు తన దృష్టిపాతాళలోకంవైపు ప్రసారించాడు.

అది తన తమ్ముడయిన ప్లూటో శుద్ధాంతఃపురము. అక్కడ పాతాళలోకాధికారియైన ప్లూటో సముక్షములో కన్పించింది ప్రొసర్పినా. ఒక పళ్లెరములో దానిమ్మపండు ఆమె కిస్తున్నాడు ప్లూటో.

పాతాళలోకంలో ఏదైనా తింటే ఎవరూ తిరిగి భూలోకానికి రారు. కనుక వెంటనే తన సేవకుని ప్లూటోదగ్గరకు పంపించాడు. తనతమ్మునికి ఇలా సందేశము పంపాడు:

"ఈ సేవకునితో భూదేవిపుత్రికయైన ప్రొసర్పినాను పంపించి వేయాలి. తన బిడ్డ లేకపోవడంవల్ల భూదేవి పనిచేయడములేదు. తత్ఫలితంగా భూలోకంలో ఘోరమైన కఱవు విజృంభించింది."

పాతాళ లోకాధిపతి తన అన్నగారిమాట తిరస్కరించగలడా? తాను అత్యధికంగా ప్రేమించి, పెండ్లాడిన ప్రొసర్పినాను వెంటనే భూలోకానికి పంపించాడు. ఎలాగో తల్లితో మాట్లాడి తిరిగివస్తానని ప్రొసర్పినా భర్తనువదలి భూలోకానికి వచ్చింది.

బిడ్డను చూడగానే భూదేవి సంతోషానికి మేరలేదు. తల్లిబిడ్డ లిద్దరూ సంతోషించారు.

"అమ్మాయీ! పాతాళలోకంలో ఏదైనా తిన్నావా?"

"ఒక్క దానిమ్మపండులో నాలుగవవంతు తిన్నానమ్మా!" అని పుత్రిక జవాబిచ్చింది.

"అయితే సంవత్సరానికి మూడునెలలూ నీవు పాతాళానికి వెళ్ళాలి."

"భర్తతో మూడు నెలలూ గడుపవచ్చని సంతోషించింది ప్రొసర్పినా. భూదేవి సంతోషంగా తన రథమెక్కి లోకమంతా తిరిగి తనపనిని ప్రారంభించింది. ఎండిన మోడులన్నీ చిగిరించాయి. పైర్లు అన్నీ పచ్చబడ్డాయి. ఫలవృక్షాలన్నీ చిగిర్చి పుష్పించి, ఫలించాయి. తిరిగి భూలోకంలో వసంతఋతువు వచ్చింది. ధాన్యాలు, కూరగాయలు, తియ్యనిఫలాలతో భూమి నిండిపోయింది. భూలోకంలో కఱవు మాయమైపోయింది. ధనధాన్యాలతో, పాడిపంటలతో భూలోకం సుభిక్షంగా ఉంది.

ప్రతి సంవత్సరమూ మంచు దట్టంగా కురిసే శీతాకాలముమాత్రము ప్రొసర్పినా భర్తతో, కాపురము చేయడానికి పాతాళలోకము వెళ్తుంది. అప్పుడు భూదేవి ఏ పనీ చెయ్యదు. తిరిగి ప్రొసర్పినా భూమిమీద అడుగు పెట్టగానె వసంతఋతువు ప్రారంభమౌతుంది. తల్లీబిడ్డలు భూలోకాన్ని సస్యశ్యామలంగా చేయడంలో నిమగ్నలౌతూంటారు.

★

# పతిత జనోద్ధరణం

(19-వ పేజీ తరువాయి)

అన్నాడారుణి. తరవాత అతనికిక ఏమనడానికి ఏమిపాలుపోలేదు:

"అది సరేగాని మీ అమ్మ తిరిగి ఇక్కడికి వచ్చి నిన్నిక్కడించి తీసుకుపోతుందేమోనని భయపడుతున్నాను."

అని ఆరుణి పరిశీలనగా ఆమె వైపు చూచాడు:

"ఏమైనా సరే! నేనిక ఆ నరకకూపంలో ప్రవేశించ దలచుకోలేదు. మీకు నేనిక్కడ నివసించడం ఇష్టం లేకపోతే నానిండు ప్రాణాలా గంగాదేవి కర్పించి వేస్తాను. అంతే!"

"తప్పు! తప్పు! అలాగనకూడదు. ఆత్మహత్య మహాపాతకమని ధర్మశాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు. అది సరేగాని నీవు తిరిగి వెళ్ళకపోతే మీ కుటుంబం అంతా అన్నవస్త్రాలు కూడా లేక ఆత్మహత్యలకు పాల్పడతారేమో. అప్పుడా మహాపాతకం అంతా నీ మెడకు చుట్టుకుంటుంది. ఆవిషయం ఏమైనా ఆలోచించావా".

"మీరన్నది నిజమే! అయితే నాకిక ఈ సంసారకూపం నించి విముక్తిలేదా? నేనీఅంధకూపంలో పడి ఇలాగే మగ్గిపోవలసిందేనా? ధర్మవేత్తలైన తామే ఇలాగ సెలవిస్తే ఇక నే నేమనగలను!"

ఆమాటకేమని సమాధానం చెప్పాలో ఆరుణికి స్ఫురించలేదు:

"అయితే మీ అమ్మతిరిగివచ్చినప్పుడాలోచించుకోవచ్చులే!"

అని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. పిమ్మట నెమ్మదిగా నెమ్మదిగా అడుగులు వేసుకుంటూతన కుటీరంలోకి వెళ్ళిపోయాడు.

—సశేషం.

★



